# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- గుజరాత్ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్"లో పాల్గొననున్నారు.
- దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో యువత పాత్ర ఎంతో కీలకమని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయా అన్నారు.
- భారత్.. ప్రపంచ శక్తిగా ఎదగడంలో స్వయం సమృద్ధి అత్యంత కీలకమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు.
- దేశ భద్రతలో సైనికుల ధైర్యం, అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకమని వెస్టర్న్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు సాయంత్రం సోమనాథ్ చేరుకున్నారు. ప్రభాస్ పటాన్‌లో జరుపుకునే "సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్"లో ఆయన పాల్గొంటారు. 1026 సంవత్సరంలో సోమనాథ్ ఆలయంపై దండయాత్ర జరిగి వెయ్యి సంవత్సరాలు... అలాగే ఆలయ పునరుద్ధరణ జరిగి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అదే విధంగా ప్రధానమంత్రి ఆలయ ప్రాంగణంలో జరిగే 'ఓంకార జపం'లో పాల్గొంటారు. దీనిలో భాగంగా రేపు నిర్వహించే శౌర్య యాత్రలో పాల్గొని సోమనాథ్ మహాదేవ్ కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం సోమనాథ్ లో జరిగే బహిరంగ కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు. సోమవారం వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సమావేశాన్ని ప్రారంభించడానికి రాజ్ కోట్ కు వెళతారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశం ప్రపంచ శక్తిగా ఎదగడంలో స్వయం సమృద్ధి అత్యంత కీలకమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. జోధ్‌పూర్‌లో ఈరోజు జరిగిన మహేశ్వరి సామాజిక వర్గ జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు.

స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించడం వల్ల దేశం స్వయం సమృద్ధిని సాధిస్తుందని, ఆత్మనిర్భర్ భారత్‌గా మారుతుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. యువత ఇతర భాషలను కూడా నేర్చుకోవాలని, అదే సమయంలో మాతృభాషను ఎప్పటికీ మరచిపోకూడదని హితవు పలికారు. మాతృభాష ప్రాముఖ్యతను కేంద్రమంత్రి అమిత్ షా వివరిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో యువత పాత్ర ఎంతో కీలకమని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన "వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2026" ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... వికసిత్ భారత్@2047 లక్ష్యసాధనకు అనుగుణంగా యువతలోని ప్రతిభను, సృజనాత్మకతను గుర్తించి, వెలికితీయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సాహసోపేతమైన ఆలోచనలు, ఆవిష్కరణలతో యువత శక్తివంతమై అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్య సాధనకు చోదక శక్తిగా మారుతుందని మన్సుఖ్ మాండవీయా పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

ఈ కార్యక్రమానికి హాజరైన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోవల్ మాట్లాడుతూ.. బలమైన నాయకత్వం మాత్రమే ఉన్నతమైన మనోధైర్యాన్ని నింపుతుందని, అది లేకపోతే ఆయుధాలు, వనరులు అన్నీ నిష్ప్రయోజనమని పేర్కొన్నారు. సరైన నిర్ణయాలు తీసుకోవడమే నాయకుడి గొప్ప బలమని ఆయన చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

జన్యుపరమైన వ్యాధుల ముందస్తు గుర్తింపు, అందుబాటులో వైద్యం అనేవి ఆరోగ్యారంగానికి ప్రధాన సవాళ్లుగా మారాయని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. హైదరాబాద్‌లో `నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ - స్కిల్లింగ్ అండ్ యాక్సెసింగ్ మాలిక్యులర్ అడ్వాన్స్‌మెంట్స్ ఇన్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ ఫర్ హెల్త్` (SAMARTH)కు కేంద్రమంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత దశాబ్దాలలో దేశం అంటువ్యాధులతో పోరాడిన పరిస్థితి ఉండేదని, దానికి భిన్నంగా ప్రస్తుతం భారతదేశం ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో అత్యాధునిక దశలోకి ప్రవేశించిందని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ డీ.ఎన్.ఏ (DNA) ప్రొఫైలింగ్‌లో ఉన్న నైపుణ్య లోపాలను SAMARTH భర్తీ చేస్తుందని కేంద్రమంత్రి తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ భద్రతలో భారత సైనికుల ధైర్యం, అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకమని వెస్ట్రన్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ అన్నారు. దేశాన్ని కాపాడటంలో అచంచల నిబద్ధత, ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికులకు ఆయన ఈరోజు ఢిల్లీలో శౌర్య పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ కటియార్ మాట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్‌తో సహ ఇటీవలి సాధించిన కార్యాచరణ విజయాలలో వెస్ట్రన్ కమాండ్ వృత్తిపరమైన నైపుణ్యాన్ని ప్రదర్శించాయని అన్నారు. యుద్ధ స్వభావం మారుతున్న నేపథ్యంలో ఆధునిక యుద్ధ సామర్థ్యాలను బలోపేతం చేయడం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా అధునాతన సాంకేతికత, డ్రోన్ల వినియోగం భవిష్యత్ యుద్ధాలలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. భారత సైన్యం ప్రధాన బలం భిన్నత్వంలో ఏకత్వం అని మనోజ్ కుమార్ కటియార్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు న్యూఢిల్లీలో అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులతో సమావేశమయ్యారు. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, మంత్రిత్వ శాఖ ఉన్నత అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 28న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఒత్తిడిని తగ్గించి సరైన పద్ధతిలో సన్నద్ధమయ్యేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే వార్షిక కార్యక్రమం "పరీక్ష పే చర్చ" 2026 లో పాల్గొనేందుకు 4 కోట్ల మందికి పైగా నమోదు చేసుకున్నారు. గత సంవత్సరం 3 కోట్ల 50 లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లతో సాధించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను ఇది అధిగమించింది. పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు ఒత్తిడి లేని వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన పరీక్షా పే చర్చ దేశవ్యాప్తంగా ఒక ఉద్యమంగా రూపాంతరం చెందిందని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ సందర్భంగా సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఈ ఏడాది నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల అభివృద్ధి కంటే మహిళల నేతృత్వంలోని అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరులో రాష్ట్ర బీజేపీ నిర్వహించిన `ప్రొఫెషనల్ కనెక్ట్` కార్యక్రమంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... దేశం 7.5 శాతం వృద్ధిని సాధిస్తోందని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలకు ప్రయోజనం చేకూర్చే అనేక పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఆయన చెప్పారు. ఇథనాల్, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని పెంచే అవకాశాలను దేశం అన్వేషిస్తోందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజస్థాన్, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లలో ఈరోజు, రేపు దట్టమైన పొగమంచు ఉంటుందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ ఈశాన్య ప్రాంతాలలో ఈ నెల 13 వరకు పొగమంచు ఉంటుందని పేర్కొంది. కర్ణాటక, ఒడిశా, పంజాబ్‌లలో రాబోయే మూడు, నాలుగు రోజులు చలిగాలులు వీచే అవకాశం ఉందని తెలియజేసింది. అదే విధంగా తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లలో రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

బలమైన, సంపన్నమైన దేశ నిర్మాణంలో యువత చోదక శక్తి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ యువతతో మమేకం కావడానికి తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' ప్రారంభం సందర్భంగా ప్రధానమంత్రి పేర్కొన్నారు. అద్భుతమైన ఉత్సాహం, అపారమైన పట్టుదల కలిగిన యువశక్తి దేశాభివృద్ధికి, పురోగతికి దోహదపడగలవని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని న్యూఢిల్లీలో జరుగుతున్న 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2026' ముగింపు సమావేశంలో ప్రధాని పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

=======================